
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# నమ్మి చేతిస్తే.. నట్టేటా ముంచుతారు

కాంగ్రెస్ పార్టీపై రైతుల ధ్వజం





## మభ్యపెట్టడం తప్ప మరోటి కాదు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు కరెంటు కష్టాలు తప్పవేమో. వారి హామీలు, మాటలు చూస్తే అనుమానంగానే ఉన్నాయి. మూడు గంటల విద్యుత్ సరిపోతుందని చెప్పడం సరికాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులకు 5హెచ్‌పీ మోటర్లు పనిచేసేలా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాటిపై భారం పడకుండా చర్యలు చేపట్టారు. అయితే, 10హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేయాలని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు, అవగాహన లేకుండా రైతులను అయోమయానికి గురిచేసే విధంగా మాట్లాడుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో కేవలం 5హెచ్‌పీ మోటర్లు సరిపోతాయి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. లో వోల్టేజీ సమస్య వస్తుంది. మోటర్లు కాలిపోతాయి. వేగంగా నీటిని తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు కూడా త్వరలో వట్టిపోతాయి. ఈ ఆలోచన సరైంది కాదు, రైతులకు కూడా వ్యవసాయం, మోటర్లు, విద్యుత్ సరఫరా విషయంలో చాలా అవగాహన పెరిగింది. రైతులను అయోమయంలోకి నెట్టే ఆలోచనలు లేకుండా చూడాలి. మూడు గంటల విద్యుత్ సరిపోతుందని చెప్పడం, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్పడం సరైంది కాదు. తిరిగి పాతరోజుల మాదిరిగానే కరెంటు, నీళ్ల కోసం రాత్రి సమయాల్లో పొలాల వద్ద పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ పార్టీ వారు కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి మోసపూరిత ప్రకటనలు చేయడం మానుకోవాలి.

**—సిరిషెట్టి సంతోష్ కుమార్, ఎడపల్లి**

## మోటర్లు.. మీటర్ల బాధలు మాకెందుకు



వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్, 10 హెచ్‌పీ మోటర్లు సరైంది కాదు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు బాధలు తప్పవు. మూడు గంటలే కరెంట్ ఇస్తే రైతులు నెత్తికొట్టుకోవాల్సి వస్తుంది. అసలు మూడు గంటల కరెంటు వ్యవసాయానికి ఎలా సరిపోతుంది. వానలు సరిగా లేకపోతే ఉన్న 5 హెచ్‌పీ మోటర్ల పరిస్థితే ఇబ్బందికరంగా ఉంటది. వాటిని తీసేసి 10 హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టుకోవాలి. వీటితో ఏం లాభం ఉంటుందో కాంగ్రెస్ నాయకులకే తెలియాలి. కొత్త మోటర్లు, మీటర్లు అంటే.. వీటి ఖర్చంతా ఎవడు పెట్టుకోవాలి.. మంచిగా ఉన్న వ్యవసాయాన్ని ఖరాబ్ చేసుకోవాలా ? కాంగ్రెస్ నాయకుల పనికిమాలిన మాటలు రైతులను ఇబ్బంది పెట్టడం తప్ప మరొకటి కాదు.. ఉన్న వ్యవసాయం కాపాడుకుని ఆనందంగా ఉండాలంటే ఇప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వం బాగుంది. కోరి కష్టాలు కొనితెచ్చుకోం..

**-కనడి రవి, నర్సాపూర్, బోధన్ మండలం**

## 3 గంటల కరెంటుతో రైతులు అప్పులపాలే..



కేసీఆర్.. రైతుల బాధలు తెలిసిన సీఎం. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు కరెంటు కోసం రైతులు రోజూ రోడ్డెక్కాల్సిన పరిస్థితులు ఉండేవి. ఆ విషయం రైతుగా కేసీఆర్‌కు కూడా తెలుసు. అందుకే రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకోవడానికి 24 గంటల కరెంటును ఉచితంగా ఇస్తున్నారు. రైతుబంధు పేరిట పంటకు పెట్టుబడి ఇస్తున్నారు. చెరువులను బాగు చేసి నీళ్లు తెచ్చారు. పండించిన పంటలను బీఆర్ఎస్ ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. రైతులు చనిపోతే వారి కుటుంబాలు రోడ్డున పడకుండా రైతుబీమా ఇస్తున్నారు. ఇవన్నీ రైతుల మేలు కోసం సీఎం కేసీఆర్ నిర్ణయాలే. ఇలాంటి పథకాలను గతంలో ఎవరూ తీసుకురాలేదు. అన్నీ బాగయ్యాక.. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు వచ్చి 3 గంటల కరెంటు ఇస్తామని అంటున్నారు. రైతులను ఇబ్బందుల్లోకి నెట్టేస్తామని చెప్పడం సరికాదు. అలాంటి పార్టీలకు రైతులు మద్దతివ్వరు. మా రైతు కుటుంబాలన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటేసి గెలిపించుకుంటాయి.

**-వెంకట్‌రెడ్డి, హంగర్గా ఫారం, ఉమ్మడి కోటగిరి మండలం**

## కాంగ్రెస్ వద్దు.. కరెంటు తిప్పలు వద్దు..



తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతులకు కరెంటు కష్టాలు తప్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడు గంటల ఉచిత విద్యుత్ అని.. రెండు మూడు గంటలు కూడా సరిగ్గా ఇవ్వలేదు. అదికూడా అర్ధరాత్రి ఇచ్చేవారు. కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాశారు. ఇప్పుడు ఆ కష్టాలేవీ లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటలే విద్యుత్ ఇస్తానంటోంది. అదే జరిగితే రైతులకు మళ్లీ చీకటి రోజులు వచ్చినట్టే. అటువంటి పాడు రోజులు మాకొద్దు. ఆ కాంగ్రెస్ పార్టీ అసలే వద్దు. మాకు కేసీఆర్ సారే కావాలి. బీఆర్ఎస్‌నే గెలిపిస్తాం.

**-మాధవ్‌రావు, హెగ్డోలి, ఉమ్మడి కోటగిరి మండలం**

## కాంగ్రెస్ వస్తే రైతుబతుకు చీకటే



కాంగ్రెస్ పాలనలో అన్నీ కష్టాలే. కరెంటుండదు.. నీళ్లుండవు.. ఎరువులు ఇవ్వరు. కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు చాలా మంది రైతులు వ్యవసాయాన్ని వదిలేసి వేరే పనులు చేసేవారు. పంటలు పండించేందుకు నానా ఇబ్బందులు పడేవారు. రాత్రుళ్లు కరెంటు లేక పొలం గట్లపై పడుకొని పాముకాటుతో చాలా మంది చనిపోయారు. ఎన్నో కుటుంబాలు ఆగమయ్యాయి. కరెంటు కోసం రోజంతా పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. కరెంటు లేక.. నీళ్లు లేక పండించిన పంటలు కండ్ల ముందే ఎండిపోయేవి. తెచ్చిన అప్పులు తీర్చలేక, నోట్లోకి ముద్ద పోక ఆకలిచావులే మిగిలేవి. ఇలాంటి సమయంలో తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేసింది. సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు, చెరువులు, కుంటల్లో పుష్కలంగా సాగునీరు ఉండడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ సర్కారు వస్తే రైతు బతుకు మళ్లీ చీకటే. మాకు బీఆరెస్ ప్రభుత్వమే కావాలి.

**- శివశంకర్, సుంకిని, ఉమ్మడి కోటగిరి మండలం**

## కాంగ్రెస్ కరెంటును నమ్మం..



రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు ఇస్తామంటున్నడు. అలా అయితే కరెంటు ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతుందో తెల్వదు. పొలానికి నీళ్లు పారియ్యాలంటే కరెంటు కోసం ఎదురు చూస్తూ ఇంటికి రాకుండా శివార్లలోనే పండుకోవాలె. కరెంటు కష్టాలను రైతులు కొని తెచ్చుకోరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తుంది. రైతులకు కరెంటు బాధలు ఏమాత్రం లేవు. ఎప్పుడు కావాలంటే అప్పుడు పొలానికి పోయి నీళ్లు పారిస్తున్నం. మిగితా పనులు కూడా చేసుకుంటున్నం. 3 గంటల కరెంటు.. 10 హెచ్‌పీ మోటర్లు అంటూ కొత్త విషయాలను రైతులతో చెప్తే ఎలా నమ్ముతారు. వ్యవసాయం గురించి రైతులకన్నా రేవంత్‌రెడ్డికి ఎక్కువ తెలుసా? రైతులను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ మాటలను రైతులు ఎప్పటికీ నమ్మం. రైతు చల్లగా ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండాలి.

**- సత్యనారాయణరెడ్డి, హంగర్గాఫారం, ఉమ్మడి కోటగిరి మండలం**

## మూడు గంటల కరెంటుతో వ్యవసాయం చేయలేం..



మూడు గంటల కరెంటుతో వ్యవసాయం చేయలేం. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు మా బతుకులు చీకట్లోనే ఉన్నాయి. సీఎం కేసీఆర్ వచ్చాకనే బాగుపడ్డాం. 24 గంటల కరెంటు ఇవ్వడంతో సంతోషంగా పంటలు పండిస్తున్నాం. ఎప్పుడు కావాలంటే అప్పుడు పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నాం. కాంగ్రెస్ 3 గంటల కరెంటు ఇస్తే ఒక్క మడి కూడా పారదు. వ్యవసాయం వదిలిపెట్టుకోవాల్సిందే. అప్పటి కరెంటు కష్టాలు మళ్లీ రావొద్దు. రాత్రి పూట బావుల వద్ద జాగారాలు చేశాం. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెసోళ్ల మాటలు వింటే మళ్లీ కష్టాలు మొదలైనట్టే.

**-విశ్వంబర్, టాక్లీ, ఉమ్మడి కోటగిరి మండలం**

## కాంగ్రెస్ మాటలింటే బొందలవడుడే..



రైతులకు సీఎం కేసీఆర్ 24 గంటలపాటు ఫ్రీగా కరెంటు ఇస్తున్నడు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రేవంత్‌రెడ్డి 3 గంటలే కరెంట్ ఇస్తడంట. మంచిగున్న కరెంటును పాడుచేసుకోం. రైతులకు మంచి చేస్తున్న కేసీఆర్‌ను వదులుకొని.. కరెంటు కష్టాలు తెచ్చుకుంటమా.. పదేండ్ల నుంచి ఎలాంటి బాధలు లేకుండా హాయిగా పంటలు పండిస్తున్నం. మోటర్లు కాలిపోతలేవ్. పొలాలు ఎండిపోతలేవ్. ఎప్పుడు కావాలంటే అప్పుడు పోయి నీళ్లు పారిస్తున్నం. వేరే పనులు కూడా చేసుకుంటున్నం. 3 గంటల కరెంటు.. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని ఎవుసాన్ని పాడు చేసుకుంటమా? లక్షల్లో పెడ్డుబడి పెట్టి పంటలు పండించాలంటే ఎట్లా? కాంగ్రెస్ మాటలింటే రైతులు బొందల పడుడే. దీనికన్నా బీఆర్ఎస్‌ను గెలిపించుకునుడు మంచిది .

**- పోతురాజ్ రమేశ్, దోమలెడ్గి, ఉమ్మడి కోటగిరి మండలం**

## 24 గంటల కరెంటే బాగుంది..



కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్నారు. బోరు బావులున్న ఉన్న రైతులకు చాలా సౌకర్యంగా ఉంటున్నది. పొలానికి ఎప్పుడు కావాలంటే అప్పుడు నీళ్లు పెట్టుకుంటున్నాం. ఎలాంటి ఇబ్బందీ లేదు. 24 గంటలపాటు కరెంటు ఉండడంతో రెండు పంటలు పండుతున్నాయి. మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేశారు. వానలు బాగా కురవడంతో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. చెరువుల కింద కూడా రెండు పంటలు పండుతున్నాయి. కేసీఆర్ వచ్చాక రైతులకు కష్టాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 3 గంటల కరెంటు సరఫారా చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పాడు. ఒక్క ఎకరానిక కూడా నీళ్లు పారవు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. రైతులతో సాధ్యం కాదు. 24 గంటల కరెంటే బాగున్నది.

**- పెద్ద సాయిలు, రైతు, కోటగిరి**